మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
ఆదివారం | 13 | జూలై | 2025 | పేజీలు : 5

## కరెండ్లను కలిసిన ఎస్వీఎస్



మైలవరం, జులై 12 మనం న్యూస్: స్థానిక మండలంలో శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆశీస్సులతో ' కరెండ్ల వెంకటనారాయణ మైలవరం 'కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ 'గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మైలవరం జమిందార్ ఎస్వీఎస్ సుధాకర్ రావు వెంకటనారాయణ కి శుభాకాంక్షలు తెలియజేశారు.



- తెలుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తజనం
- దుర్గమ్మకు ఆషాడ సారె సమర్పణ
- అంతరాలయ దర్శనం రద్దు
- సామాన్య భక్తులకు వేగంగా దర్శనం
- చండీ హోమం, లక్ష కుంకుమార్చనలు
- భక్తులకు ఉచితప్రసాదం, అన్నప్రసాదం

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

2 లో

- విజయవాడ పశ్చిమ, మనం న్యూస్



2 లో

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

## సమయపాలన లేని వృత్తి జర్నలిజం

ఆరోగ్యం కాపాడుకోవడం ద్వారా సమాజ సేవ

ఎమ్మెల్యే బొండా ఉమా

## ప్రజల భద్రత కోసం నిరంతర పర్యవేక్షణ

- సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- ప్రజల పట్ల పూర్తి బాధ్యతతో ఉండాలి
- నగరంలో సుమారు 7వేల కెమెరాలు ఏర్పాటు చేశాం
- నేర నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా కీలకం
- సెంట్రల్ డివిజన్ సురక్షా కమిటీ సమావేశం
- డి.సి.పి. సరిత, ఏ.సి.పి. కె.దామోదర రావు

4 లో



# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

**మొదటి పేజీ తరువాయి...**





కనకదుర్గమ్మ వారికి ఆషాఢ సారె సమర్పణకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో దుర్గమ్మ క్షేత్రం కిట కిట లాడింది. తెల్లవారు జాము నుండే భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ ఈవో శీనా నాయక్ స్వయంగా పర్యవేక్షించి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రత్యేక విధులు కేటాయించిన దేవస్థానం సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించారు. విపరీతంగా పెరిగిన భక్తులరద్దీ అనుసరించి రూ. 500 అంతరాలయ దర్శనం రద్దు చేసి సామాన్య భక్తులకు వేగంగా దర్శనం కల్పించారు. ఆషాఢ సారె సమర్పణనిమిత్తం విచ్చేసిన బృందాలు కోసం ఎప్పటికప్పుడు క్యూలైన్లు పరిశీలన చేసి ప్రత్యామ్యాయమార్గాలు ఏర్పాటు చేశారు.పాత మెట్లు, మహా మండపం మెట్లు, లిఫ్ట్ మార్గం, ఘాట్ రోడ్ గుండా భక్తులు కొండ పైకి చేరుకున్నారు. ఉత్తరాంధ్ర భవానీ దీక్షా సేవా పీఠం అధ్యక్షులు పులపా మల్లేశ్వరావు గురుభవాని ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల నుండి సుమారు 1000మందికి పైగా భక్తులు ఆషాఢ సారె సమర్పణ కు వన్ టౌన్ వినాయక టెంపుల్ నుండి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. మహా మండపం 6వ అంతస్తులో సారె సమర్పణ బృందాలకు ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం ఏర్పాటు చేయడమైనది. ప్రధాన ఆర్జిత సేవలైన చండీ హోమం, లక్ష కుంకుమార్చన తదితర పూజలలో భక్తులు పాల్గొన్నారు. ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదం భక్తులకు అందేలా ఆలయసిబ్బంది చర్యలు తీసుకున్నారు.

# సమయపాలన లేని వృత్తి జర్నలిజం

**మొదటి పేజీ తరువాయి...**



సమయపాలన లేని వృత్తి జర్నలిజం అని, నిద్రాహారాలు మానేసి ప్రజాసేవలో నిమగ్నమైన జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, విజయవాడ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో ఎన్నో హాస్పిటల్స్ ఉన్నప్పటికీ బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్ కి ఒక ప్రత్యేకత ఉందన్నారు. కోట్లాది రూపాయల విలువైన పరికరాలు ఉన్న ఈ హాస్పటల్లో ఆదాయ ఆర్జన లో కాకుండా సామాజిక సేవలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ప్రశంసించారు. గతంలో క్యాన్సర్ మహమ్మారి కారణంగా ఎన్నో మరణాలు సంభవించేవన్నారు. ప్రస్తుతం క్యాన్సర్ కి ఎన్నో రకాల టెస్టులు, ఔషధాలు వచ్చాయని తెలిపారు. శరీరంలో వచ్చే లక్షణాలను బట్టి ఏ అవయవంలో అసాధారణ రీతిలోలో లక్షణం కనిపిస్తుందో దానిని నిర్ధారించడం జరుగుతుందన్నారు. మిగతా హాస్పిటల్ కన్నా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ సేవా తత్పరత చాటుకుంటుందన్నారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా ఇప్పుడు ప్రెస్ క్లబ్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరగడం సంతోషకరమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద 140 రకాల వ్యాధులకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సెంట్రల్ నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ ఉన్న దృష్ట్యా దాని అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ కుమారి మాట్లాడుతూ లైఫ్ స్టైల్ కు అనుగుణముగా రోజు రోజుకి క్యాన్సర్ వ్యాధి పెరిగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ క్యాన్సర్ నిర్ధారణ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రాథమికంగానే రోగ నిర్ధారణ జరిగితే క్యాన్సర్ ను నియంత్రించవచ్చని ఆమె తెలిపారు. పాఠశాలలో, కాలేజీలో విద్యాపరంగా క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కల్పించేలా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ శిబిరంలో మమోగ్రాఫ్, గర్భాశయ స్కానింగ్ , పాప్స్పియర్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఊపిరితిత్తుల ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, యూనియన్ సీనియర్ నాయకులు, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె బాబు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపకులు చందు జనార్ధన్ , ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా ర వి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు , సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో విశేషంగా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని వివిధ పరీక్షలు చేయించుకున్నారు.

# రజకుల రామాలయంలో ఆషాడ సారె వేడుక



**ఘంటసాల, జులై 12 (మనం న్యూస్):** ఆషాడ మాసం సందర్భంగా ఘంటసాల రజకుల రామాలయంలో ఆషాడ సారె కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలోని సీతారాముల విగ్రహ దాతలు పోతార్లంక శ్రీనివాసరావు -రజినీ దంపతులచే సీతారాములకు అర్చకులు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహిళలంతా కలసి పసుపు, కుంకుమ, పండ్లు, నూతన వస్త్రాలతో పాటు వివిధ రకాల స్వీట్లు, చలిమిడిని తీసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మ వారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు ఆదిరాల భవాని, పోతార్లంక వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, బొమ్మిడి బంటి, పోతార్లంక రాజేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ అందజేత



**విజయవాడ పశ్చిమ, జూలై 12 (మనం న్యూస్):** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఎల్.ఓ.సి ను శనివారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. 43 వ డివిజన్ ఏకలవ్య నగర్ కు చెందిన బీ కుమారి (47) గర్భాశయ సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది. తనకి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేయగా రూ 4లక్షల ఎల్. ఓ.సీ పత్రాన్ని బాధితురాలి తనయుడు ప్రదీప్ కు ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందించారు. త్వరితగతిన ఎల్.ఓ.సీ మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు సయ్యద్ రఫీ, కొనికి కొండయ్య , బొల్లేపల్లి కోటేశ్వరరావు, బెవర శ్రీనివాస్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# అవనిగడ్డ సభలో పేర్ని నానీ విద్వేషకర వ్యాఖ్యలపై అభ్యంతరం

- **తక్షణమే నానీ వ్యాఖ్యలు ఉప సంహరించుకోవాలి**
- **జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు**



**అవనిగడ్డ, జులై 12 (మనం న్యూస్) :** వైసీపీ అవనిగడ్డ సభలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షునిగా పేర్ని నానీ చేసిన విద్వేషకర వ్యాఖ్యలపై జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పేర్ని నానీ వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యం అన్నారు. తక్షణమే నానీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో పని చేసిన వ్యక్తి చేస్తున్న వ్యాఖ్యలు సమాజాన్ని ఎటువైపు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నారో ప్రజలందరూ అర్థం చేసుకోవాలని సూచించారు. రప్పా రప్పా అని పైకి చెప్పకుండా చీకట్లో కన్నుకొట్టి పని పూర్తి చేయాలి అంటూ పేర్ని నానీ చేసిన వ్యాఖ్యలతో వైసీపీ శ్రేణులకు ఎలాంటి సంకేతం ఇచ్చారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఇలాంటి నాయకులు రేపు ప్రజల స్క్రూటీనీలో నిలబడలేరని స్పష్టం చేశారు. గుడ్డ కాల్చి ఎదుటివాడిపై వేద్దామంటే సహించేది లేదన్నారు. వైసీపీ నాయకులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని స్పష్టం చేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ నియోజకవర్గంలో రూ.822 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ మేరకు స్పష్టమైన వివరాలతో కరపత్రం కూడా విడుదల చేశామన్నారు. దివిసీమ జీవనాడి పులిగడ్డ ఆక్విడెక్టును స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు హయాంలో విస్తరిస్తే, మండలి బుద్ధప్రసాద్ ఆక్విడెక్టును పరిరక్షించుకుంటూ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఆక్విడెక్ట్ మరమ్మత్తులకు రూ.53 లక్షలు మంజూరు అయితే కనీసం పనులు చేయించని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ శిథిలావస్థకు చేర్చారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో రూ.కోటికి పైగా నిధులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆక్విడెక్ట్ సమగ్ర అభివృద్ధి చేస్తుంటే కేవలం రంగులు వేశారని చెప్పటం సిగ్గుచేటు అన్నారు. ఆక్విడెక్టుకు నీటి వృధా అరికట్టే చర్యలు, సర్ ప్లస్ ఎస్కేప్ అభివృద్ధి, నూతన హ్యాండ్ రైలింగ్ ఏర్పాటు, పెయింటింగ్ పనులు ఇప్పటికే పూర్తి చేశారని, ఇంకా లాక్ ఛాంబర్స్ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క పంట కాలువను, మురుగు కాలువను పట్టించుకోని గత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ చిల్లులు పడిన షట్టర్లతో రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తే, కూటమి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నియోజకవర్గంలో పంట కాలువలకు తొలి ఏడాదిలోని 43 నూతన షట్టర్లు ఏర్పాటు చేశారన్నారు. రైతులకు సమర్థవంతమైన సాగునీరు, మురుగునీరు వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్లు బండి కోళ్లలంక చెక్ డ్యామ్ పేరుతో నేలవిడిచి సాము చేసిన సింహాద్రి రమేష్ క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. నియోజకవర్గానికి కీర్తి కిరీటంలా నిలిచే నాగాయలంక క్షిపణి పరీక్ష కేంద్రం సాధన కోసం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి చేసిన విస్తృత కృషి ఫలించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో సాక్షాత్తు ప్రధాని మోడీ ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడం నియోజకవర్గంతో పాటు జిల్లాకే గర్వకారణంగా నిలిచింది అన్నారు. ఇంతటి మహోన్నత ప్రాజెక్టును ఐదేళ్లపాటు ముందుకు సాగకుండా చేసిన వారెవరో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఒక వైపు షరతులు గల పట్టాల రైతులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పరిష్కార ప్రక్రియ వేగవంతంగా జరుగుతూ ఉంటే అబద్ధాలు చెప్పటం అలవాటు పడిన వైసీపీ నాయకులు నేటికీ అబద్ధాలనే ప్రచారం చేసే ప్రయత్నంలో ఉన్నారన్నారు. వైసీపీ పాలనలో జరిగిన లిక్కర్ కుంభకోణం ద్వారా దోచుకున్న సొమ్ము నేడు విచారణలో భాగంగా గుట్టలుగా బయట పడుతున్న నేపథ్యంలో నాటి వైసీపీ దోపిడి వ్యవహారం బట్టబయలు అవుతోందన్నారు. వైసీపీ హయాంలో అవనిగడ్డ నియోజకవర్గంలో ఐదేళ్లపాటు విచ్చలవిడిగా దాచుకో దోచుకో అనే స్థాయిలో మట్టి, ఇసుక, బుసక, రేషన్ బియ్యం దోపిడి సాగించిన వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంలోనూ కొంతమంది అధికారులు, సిబ్బందితో ఉన్న పాత పరిచయాలతో అడ్డుపెట్టుకొని నేటికీ అక్రమ వ్యాపారాలు దోపిడి కొనసాగిస్తున్నారన్నారు. ఐదేళ్లు దోచుకున్న వైసీపీ వాళ్ళు తమ నాయకుడు మండలి బుద్ధప్రసాదుపై విమర్శలు చేయటం హాస్యాస్పదం అన్నారు. కూటమి ప్రభుత్వం అనునిత్యం మంచి ప్రభుత్వంగా ప్రజా ప్రభుత్వంగా ప్రజలకు సేవ చేస్తోందని, ఇచ్చిన ప్రతి హామీని అమలులోకి తెస్తోందని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది కాలంలో అవనిగడ్డ నియోజకవర్గంలో ఏ ఒక్క వైసీపీ నాయకునిపై కానీ, కార్యకర్తపై కానీ ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, ఎంపీటీసీ బొప్పన భాను, పార్టీ కోడూరు, చల్లపల్లి టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, బొందలపాటి వీరబాబు, సీనియర్ నాయకులు సిద్దినేని అశోక్ నాయుడు, నాగాయలంక మండల జనసేన పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి, నాయకులు యలవర్తి నాగ మునీంద్రరావు (చిన్నా), కమ్మిలి సాయి భార్గవ, కొండవీటి పాండురంగారావు పాల్గొన్నారు.

# కోర్టును తనిఖీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



**జగ్గయ్యపేట జూలై 12 మనం న్యూస్:** కృష్ణాజిల్లాలో గల కోర్టుల పనితీరు మరియు సబ్ జైళ్ల నిర్వహణ తనికీలలో భాగంగా శనివారం కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి జగ్గయ్యపేట కోర్ట్ ప్రాంగణం మరియు సబ్ జైలు ను సందర్శించారు.సంబంధిత సిబ్బంది నుండి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు మంజురూ దశలో వున్న సబ్ కోర్ట్ దస్త్రంపై త్వరితగతిన నివేదికను హైకోర్టు వారికి అందజేయవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమం లోజిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.వి. రామకృష్ణయ్య, నందిగామ న్యాయమూర్తి షేక్ రియాజ్ కోర్ట్ సిబ్బంది, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు, బార్ అసోసియేషన్ వెల్ఫేర్ వింగ్ పర్యవేక్షకుడు గండికోట శ్రావణ్ కుమార్, దాసరి నాగేశ్వరావు, దామల సంతోష్, కారుపాటి వీరాస్వామి, డి. రత్నబాబు, మన్నెం మురళి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**నందిగామ టౌన్, జూలై 12 (మనం న్యూస్):** స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్, కె.గోపాల్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, మళ్లీ పెంచబోమని కూటమి పార్టీలు ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఏడాదిగా విద్యుత్ బిల్లులను విపరీతంగా ప్రభుత్వం పెంచిందని మండిపడ్డారు. రు.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారం జనంపై వేశారనిఅన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానానికి భిన్నంగా ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. గత ప్రభుత్వం రూ.1750 కోట్లు ముడుపులు తీసుకుని అదానీ సంస్థతో 25 ఏళ్ళ పాటు అధిక రేట్లకు సోలార్ విద్యుత్ సరఫరా చేసే ఒప్పందాన్ని సెకి సంస్థ ద్వారా చేసుకున్నారు. దీనివలన లక్షా 20వేల కోట్ల రూపాయల భారం వినియోగదారులపై పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ అవినీతి ఒప్పందాన్ని రద్దు చేయకుండా కొనసాగించడం ప్రజలకు పెనుభారమన్నారు. ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను పునః సమీక్షించాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలకొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి నేతలు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కానీ మాట తప్పి కూటమి ప్రభుత్వం అదానీ సంస్థకు చెందిన అవే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నదన్నారు. ఇప్పటికే వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు పెట్టి భారీగా బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. నివాస గృహాలకు కూడా పెడుతున్నారన్నారు. ఈ మీటర్ల ఖరీదు కూడా వినియోగదారుల నుండి వసూలు చేస్తామని నోటిఫికేషన్లో పేర్కొన్నారని అన్నారు. అందుకే సి.పి.ఎం.పార్టీ ఈ క్రింది డిమాండ్లపై పోరాడుతున్నదన్నారు. ప్రజలను చైతన్యం చేస్తుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విద్యుత్ భారాలు రద్దు చేయాలని ప్రభుత్వానికి విన్నవించాలని ప్రజలను కోరారు. 1. అన్నిరకాల విద్యుత్చార్జీలు పూర్తిగా రద్దు చేయాలి. స్మార్ట్మీటర్లు బిగించవద్దు.2. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి. బిగించిన స్మార్టీమీటర్లు తొలగించాలి. 3. అదానీ సంస్థతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి. 4. అధిక ధరలతో వివిధసంస్థలతో గతంలో చేసుకున్న ఒప్పందాలనరద్దు చేయాలి వంటి డిమాండ్లను పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నందిగామ కమిటీ నాయకులు కర్రి వెంకటేశ్వర్రావు, జి గోపి నాయక్, షేక్ హస్సన్, పాల్గొన్నారు.

# సుపరిపాలన తొలి అడుగుతో ప్రజలందరికీ మరింత సంక్షేమం

- **రోజు ఇంటింటికి ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు**



**మైలవరం, జులై 12 మనం న్యూస్:** సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి ప్రచారంతో ప్రజలందరికీ మరింత సంక్షేమం చేకూర్తుందని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ అన్నారు. తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 101బూత్ లలో గడపగడపకు తిరుగుతూ ఏడాది పాలనలో రాష్ట్రం ప్రభుత్వం చేసిన, చేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధి కై ఎమ్మెల్యే వసంత చేస్తున్న కృషిని ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీసులకు ఫిర్యాదు



**మచిలీపట్నం, జూలై 12 (మనం న్యూస్):** మాజీ మంత్రి పేర్ని నాని పై ఆర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. హింసను ప్రేరేపించేలా పేర్ని నాని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పేర్ని నానిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా జిల్లాలో జరుగుతున్న వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో మాజీమంత్రి పేర్ని నాని పాల్గొని అభ్యంతరకర పదజాలంతో రప్పా.. రప్పా.. డైలాగ్ తో హింసను ప్రేరేపించేలా ప్రసంగాలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా వీడియోలను వైరల్ చేస్తున్నారు.పేర్ని నాని వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో పేర్ని నానిపై టిడిపి నాయకులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు సయ్యద్ ఖాజా, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రమణ్యం, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, టిడిపి నగర అధ్యక్షుడు స్వామి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ వ్యవస్థ పోటీపడి దిగజారిపోయే పరిస్థితి ఏర్పడింది




**హనుమాన్ జంక్షన్, జూలై 12(మనంన్యూస్):** రోజు రోజుకు ఫోటోగ్రఫీ వ్యవస్థ పోటీపడి దిగజారిపోయే పరిస్థితి ఏర్పడిందని హనుమాన్ జంక్షన్ ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రపాణి విజయ్ కుమార్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ లోని లయన్స్ క్లబ్ కళ్యాణ మంటపం లో సోనీ వర్క్ షాప్ నిర్వహించారు. సోనీ కంపెనీ నుండి ఈ వర్క్ షాప్ కు ఫాకల్టీ గా చైతన్య ( సోనీ అర్ ఎస్ ఓ ) వ్యవహరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నేల నుండి రోదసి వరకు ఫోటో గ్రఫి కి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని ఫోటో గ్రాఫర్లలో నైపుణ్యం మరింత పెంపొందించుకునేందుకు ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముందుగా ఈ వర్క్ షాప్ ను లయన్స్ గ్లోబల్ ప్రెసిడెంట్ లయన్ తాడి రంగారావు, హనుమాన్ జంక్షన్ ఫోటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి విజయ్ కుమార్, ట్రెజరర్ గంటా శ్రీనివాస్ వర్క్ షాప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళ్ళేపల్లి నారాయణరావు, అంబళ్ళ వెంకట రంగారావు ,కర్ణికోట చిన్ని, నిభానుపూడి వాసు ప్రసాద్ , వల్లభనేని ప్రభాకర్ ,మహేష్, జోజి బాబు, నౌలూరి సతీష్, చాపరాల మురళి, వేల్పూరు రంగబాబు, మల్లి . అమృతరాజ్, దాసరి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి ప్రింటర్ అధినేత తోట సత్యన్నారాయణ మూర్తి ఎఫ్సాన్ ప్రింటర్ ఉచిత సర్వీసింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఫాకల్టీ సోనీ కళ్యాణ్ ను ఫోటో గ్రాఫర్లు ఘనంగా సన్మానించారు.

# నేటి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె బాట

**నందిగామ టౌన్, జూలై 12 (మనం న్యూస్):** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం నుండి సమ్మెబాట పట్టనున్నట్లు సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి హెచ్ శ్రీనివాస్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలనీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ కోరుతూ ఈ నెల 13 నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయుకులు కె. గోపాల్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి దసవరపు సైదా,పరిమి రవి, శ్రావణ్ కుమార్, దారెల్లి అశోక్, కండెల శ్రీను, దాసు,బ్రహ్మం, కార్మికులు పాల్గొన్నారు.




# లోకేష్ పేరు ఎత్తే అర్హత బియ్యం దొంగకు లేదు




**అవనిగడ్డ, జులై 12 (మనం న్యూస్):** మంత్రి నారా లోకేష్ పేరు ఎత్తే కనీస అర్హత చిడతల అప్పారావుగా పేరు గాంచిన బియ్యం దొంగ పేర్ని నానీకి లేదని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. దొంగ బియ్యం కేసులో తన భార్యను అడ్డు పెట్టుకొని జైలుకి వెళ్లకుండా తప్పించుకొని తిరుగుతూ ఇతరులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అవనిగడ్డ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కనపర్తి విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు వైకాపాకు ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా రప్పా , రప్పా అంటూ నరికేసినా వారికి ఇంకా సిగ్గు రాలేదని అన్నారు. ఇలాంటి భాష మాట్లాడి నందుకే జగన్ ముఠాను ప్రజలు అసహించుకున్నా వారిలో మార్పు రాక పోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్ట పరిచి, పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా శాంతి భద్రతల సమస్యలు సృష్టించాలని వైకాపా నేతలు కుట్ర పన్నారని అన్నారు. ఎంత రెచ్చగొట్టినా పోలీసులు తమను అరెస్టు చేసి కేసులు పెట్టటం లేదన్న మనో వేధన వైకాపా అగ్ర నేతల్లో కనబడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల కూటమి ప్రభుత్వానికి సహకరించటమే కాక తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ప్రకటన ఇవ్వటం, భారీగా పరిశ్రమలు రావడం, ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం పెట్టడం లాంటి పథకాలతో జగన్ కు లండన్ మందులు పనిచేయక నిద్రలేని రాత్రులను గడుపుతున్నాడని అన్నారు. జగన్ అధికారంలోకి రాగానే చంద్రబాబు, లోకేష్ లను బయటకు రాకుండా వారిపై దాడులు చేయించటం, వారి కుటుంభ సభ్యులపై వ్యక్తిత్వ హననానికి పాల్పడటం లాంటి నీచమైన పనులకు పాల్పడబట్టే వారికి ఈ గతి పట్టిందని అన్నారు. నాని, అంబటి రాంబాబు లాంటి పిట్టల దొరల మాటలకు తెలుగుదేశం కార్యకర్తలెవరూ భయపడరని, మంత్రి నారా లోకేష్ పేరెత్తితే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కనపర్తి హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కర్రా సుధాకర్ మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, జనార్ధనరావు, మెండు లక్ష్మణరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమంచిపల్లి లో గంగమ్మ తల్లి గుడికి వైసిపి నేత వైకుంఠ రావువిరాళం



**జగ్గయ్యపేట జులై 12 మనం న్యూస్:** జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సల్ల వైకుంఠరావు 25వేల రూపాయల విరాళాన్ని అందించారు. ఆలయ ఆ విరాళాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు చేతుల మీదగా నిర్మాణ కమిటీ సభ్యులకు శనివారం అందించారు. జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో వైయస్సార్ ప్రభుత్వంలో అందించిన టిటిడి నిధులతో నిర్మించిన గంగమ్మ తల్లి గుడికి దాతల సహాయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు రూ. 25వేలు గ్రామ నాయకులు సహాయం తోటి జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సమక్షంలో కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పానుగంటి బ్రహ్మనాయుడు, మండల ఎస్సీ సెల్ పాతకోటి ఉదయభాను, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి మాజీ సర్పంచ్ యానాల గోపి, చల్లా నరేంద్ర యాదవ్, బుల్లిగొర్ల చంద్రయ్య, సీతయ్య, కంపసటి ఆదినారాయణ, కంప సాటి వెంకటేశ్వర్లు, నిమ్మకాయల వెంకటేశ్వర్లు, పసుపులేటి సాంబశివరావు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్వచ్ఛత లీగ్‌లో విజయవాడ

- ఈ పురస్కారం కేవలం విజయవాడకే కాదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే చెందుతుంది
- విజయవాడ మేయర్ రాయన భాగ్య లక్ష్మి, కమిషనర్, ధ్యానచంద్ర హెచ్ యం



**విజయవాడ సెంట్రల్, జూలై 12 (మనం న్యూస్):** స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో సూపర్ స్వచ్ఛత లీగ్ లో విజయవాడ నగర పాలక సంస్థ ఎంపికైందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి , కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, శనివారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతూ జూలై 17, 2025న భారతదేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరగబోవు స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం 2024లో ప్రెసిడెంట్ ద్రౌపతి ముర్ము గారి చేతుల్లో మీదుగా అవార్డును అందుకోబోతున్నట్లు తెలిపారు. అందుకు ముఖ్య కారకులైన, ప్రజలు పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నగర కమీషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో భాగంగా మొట్టమొదటిసారిగా సూపర్ స్వచ్ఛతా లీగ్ ప్రవేశపెట్టిన సంవత్సరంలోనే లీగ్ లో విజయవాడ నగరం ఎంపికవటం గర్వకారణం అని, ఇండోర్, నవి ముంబై, సూరత్ నగరాల జాబితాలో విజయవాడ నగరం కూడా చేరినందుకు తమకెంతో గర్వంగా ఉందని. ఈ అవార్డు నగర ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛ సర్వేక్షన్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిదని తెలిపారు. 2024 విజయవాడ లో తీవ్రమైన విపత్తు బుడమేరు వరదలు సంభవించినప్పటికీ గత సంవత్సరాలు కంటే ఎక్కువగా అత్యుత్తమ స్థానాల్లో ఉన్న నగరాలతో పాటు స్వచ్ఛ సర్వేక్షన్ లో విజయవాడ స్థానం దక్కించుకోవడం గొప్ప విషయమని అన్నారు. విపత్తు సమయంలో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్ పొంగూరు నారాయణ, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్, డిఎంఎ పి. సంపత్ కుమార్, ఎండి స్వచ్ఛ ఆంధ్ర వి.అనిల్ కుమార్ రెడ్డి, గారి సహకారంతో విజయవాడ నగరం పదివేల పారిశుద్ధ్య కార్మికులతో, 200 మందికి పైగా అధికారులతో, 32 కు పైగా ఐఏఎస్ లతో వరదల వల్ల వచ్చిన వ్యర్థాలకు, వ్యర్థ నిర్వహణ చేయటం వల్ల విజయవాడ త్వరితగతిన కోలుకోవడమే కాకుండా జాతీయస్థాయిలో ఉత్తమ పురస్కారాన్ని అందుకోబోతుందని తెలిపారు. ఈ పురస్కారం కేవలం విజయవాడ నగరానిదే కాదు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటిది అని అన్నారు.

# పేర్నినాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం



**మచిలీపట్నం, జూలై 12 (మనం న్యూస్):** శారదానగర్‌లో శనివారం ఆత్మీయ సమావేశానికి ఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మీడియా మనం న్యూస్ ప్రతినిధి ప్రత్యేకంగా ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావు ను పలకరించగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ఫలితాల్లో జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా దక్కకుండా.. ఘోరంగా ఓడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం అత్యంత అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారు. రప్పా.. రప్పా.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి.. తలలు లేచిపోవాలి.. అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం..? మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యన్ని రక్షించేవిధంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంది.. సీఎం చంద్రబాబు సారధ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో హింసను ఎట్టిపరిస్థితుల్లో ప్రొత్సహించరు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తు.. అవినీతి మయంగా, ఆరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్కృతి.. ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్ని నాని మీద బందరులో ఎన్ని అభియోగాలు ఉన్నాయి.. ఎన్ని నేరాలు చేశావ్.. గోడౌన్ లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి. రంగనాయకుల గుడి 10 ఎకరాల స్థలానికి ఏమి సమాధానం చెప్తావ్.. బీచ్ పక్కన ఉన్న గుడిసెలను తగలబెట్టారు.. దానికి ఏమి సమాధానం చెప్తావ్.. దమ్ము ఉంటే అక్కడికి వెళ్లి మాట్లాడాలి.. పేర్ని నాని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ్మిన వారి సత్రానికి చెందిన 1000 గజాల స్థలాన్ని అక్రమించుకున్నారు. పేర్ని నాని తండ్రి పేర్ని విష్ణుమూర్తి ఎనాడూ కూడా హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ, నీ ప్రవర్తన ధోరణీ మీ నాయకుడు మెచ్చుకునే విధంగా ఉంది. హింసను ప్రోత్సాహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే మీ నాయకుడికి ఆనందం.. జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .. ఎక్కడ ఏ విధమైన అవంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తే.. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం యువనాయకులు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగు అడుగున ఆటంకాలు సృష్టించారు. మేము అధికారంలోకి వస్తే గతంలో కంటే మంచి పాలన సాగిమని చెప్పలే కానీ, బెదిరింపులు మాటలతో ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు'' అని అన్నారు.

# డ్రగ్స్ వద్దు బ్రో

- ఈగల్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ ఐపిఎస్




**విజయవాడ తూర్పు, జూలై 12(మనం న్యూస్):** డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ ఈగల్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ ఐపిఎస్ , డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జి.వి. సరిత ఐ.పి.ఎస్., విద్యార్థిని విద్యార్థులకు సూచన చేశారు.. మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు,ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మరియు రాష్ట్ర ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ (ఈగిల్) వింగ్ డైరెక్టర్ ఎకె రవి కృష్ణ అన్నారు.. మాదక ద్రవ్యాల వినియోగం, వాటి దుష్పరిణామాలపై ఈ రోజు విజయవాడ లోని సిద్ధార్థ ఫార్మసిటికల్ కాలేజీలో జరిగిన డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాన్ని చేస్తూ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు.. ఉన్నత విద్యలో గంజాయి, కొకైన్ మరియు హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు బలైపోతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం పై ఈగల్ డైరెక్టర్ రవి కృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.. నిషేధిత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని, ప్రస్తుతం గంజాయి, బ్రౌన్ షుగర్, హెరాయిన్, కొకైన్, చెరస్ తదితర మాదకద్రవ్యాలకు బానిసలై, కొంత మంది యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జి.వి. సరిత ఐ.పి.ఎస్. ఆవేదన వ్యక్తం చేశారు.. ఎవరు పైన అనుమానం ఉన్నట్లయితే 1972 నెంబర్కు కాల్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు..

# అభివృద్ధి, సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బొండా ఉమా

**విజయవాడ సెంట్రల్, జూలై 12 (మనం న్యూస్):** శనివారం 1వ డివిజన్ గుణదల ఉలవచారు కంపెనీ దగ్గర ఆదర్శనగర్ కాలనీలో ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని, ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ సుపరిపాలన కార్యక్రమాన్ని సెంట్రల్ నియోజకవర్గం అంతటా ముమ్మరంగా 21 డివిజన్లలో కొనసాగిస్తున్నామని, నియోజకవర్గం లో ఉన్నటువంటి 2.80 లక్షల మంది ఓటర్లను కలిసి కూటమి పరిపాలన పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. ఎన్డిఎ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళు లా భావిస్తూ ముందుకు వెళ్తూ, నియోజకవర్గం లో ఇప్పటివరకు రు.240 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసామన్నారు.




# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం

- ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్

**విజయవాడ పశ్చిమ,జూలై 12 (మనం న్యూస్):** శనివారం దేవస్థాన కార్యాలయంలో నగర పోలీస్ శాఖ అధికారులు, దేవస్థానం సిబ్బంది, వైదిక సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ మాట్లాడారు. హైదరాబాద్ వంటి ప్రాంతాల నుండి కొన్ని గంటల్లోనే విజయవాడ చేరుకుని కుమ్మరి పాలెం సెంటర్ నుండి దేవస్థానం పైకి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని భక్తులు పేర్కొన్న విషయాల పై ప్రత్యామ్నాయ దారులు గురించి, టోల్ గేట్ మార్పు చేయడం గురించి చర్చించారు. మునిసిపల్ ఆఫీస్ వద్ద హోల్డింగ్ ఏరియా అభివృద్ధి, కనకదుర్గ నగర్, దుర్గాఘాట్ లో ఇన్ఫర్మేషన్ సెంటర్స్ ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం పాలనా వికేంద్రీకరణ క్రింద కొండ దిగువునే పలు సౌకర్యాల ఏర్పాటు గురించి పోలీస్ అధికారులకు ఈవో వివరించారు. కొండ దిగువున దేవస్థాన ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిభింభిచేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు జి. రామకృష్ణ, దుర్గారావు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ కోటేశ్వరరావు, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

